క్లుప్తంగా

ఘనంగా పచ్చగెరిగ ఊరేగింపు



ఊరేగుతున్న అమ్మవారు

రామకుప్పం: గంగమాంబ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రామకుప్పంలో పచ్చగెరిగ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అగ్ని గుండంలో అగ్ని ప్రజ్వలన చేశారు. గ్రామంలోని సల్లాపురెమ్మ ఆలయం నుంచి డప్పులు, మంగళవాయిద్యాల నడుమ పచ్చగెరిగ ఊరేగింపును ప్రారంభించారు. పచ్చగెరిగ వెంబడి గంగమ్మ, పోతురాజు ఉత్సవ మూర్తులు ఊరేగారు. భక్తులు అడుగడుగునా అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించారు. రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో అమ్మవారు తొలుత అగ్ని ప్రవేశం చేశారు. అనంతరం భక్తులు నిప్పులపై నడిచి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు విస్తరణకు డిమాండ్



కుప్పం- పరమసముద్రం రోడ్డు

కుప్పం రూరల్ : కుప్పం–పరమసముద్రం మార్గంలోని రోడ్డును విస్తరించలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. హాకింగ్‌స్కూల్, కస్తూర్బా బాలికల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలకు ఈ రహదారి నుంచే వెళ్లాలని వెల్లడిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులతో రద్దీగా ఉంటుందని, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ రోడ్డు వెడల్పు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డును విస్తరించాలని కోరుతున్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దినేష్ కుమార్

రొంపిచెర్ల : స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం ఈ మేరకు వైద్యాధికారి దినేష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా బీపీ, షుగర్, గుండె పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. ప్రతి రోజూ పళ్లరసాలు, ఎండు ద్రాక్ష, ఖర్జూరం, వేరుశనగ, నువ్వుల ఉండలు, జామ, ఉసిరి, సపోటా వంటి పండ్లను ఎక్కువగా భుజించాలని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని కోరారు. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

నేడు పలమనేరు మున్సిపల్ సమావేశం

పలమనేరు : పలమనేరు మున్సిపల్ సాధారణ సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయనన్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

టీచర్ల శిక్షణ తరగతుల తనిఖీ



మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రశేఖర్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 1వ తేదీ నుంచి టీచ్ టూ టూల్ పేరిట టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్ నేర్పుతున్న అంశాలపై టీచర్లు ఎంతమేరకు అధ్యయనం చేశారో గమనించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలు బడిలో బోధనకు ఉపయుక్తంగా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లీలా రాణి పాల్గొన్నారు.

సంకల్ప బలం.. కల సాకారం!

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. ప్రాథమిక విద్య నుంచి క్రమశిక్షణతో చదివితే అనుకున్న స్థాయిని కచ్చితంగా అందుకోవచ్చు. డిప్యూటీ సీఎం ఓఎస్‌డీగా నియమితులైన మధుసూదన్ ఎదిగిన క్రమమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. చిరుప్రాయంలో కన్న కలను సాకారం చేసుకునేందుకు ఆయన కఠోరంగా శ్రమించారు. సంకల్ప బలంతో ఉత్తమంగా రాణించారు. కీలకమై పోస్టులో బాధ్యతలు చేపట్టారు. పలమనేరులో ప్రైమరీ విద్యాభ్యాసంతో మొదలైన మధుసూదన్ ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

- పలమనేరు నుంచి మొదలైన ప్రస్థానం
- 2018 గ్రూప్–1 పరీక్షలో స్టేట్ సెకండ్ ర్యాంక్
- ధర్మవరం.. కడప ఆర్‌డీఓగా ఉత్తమ సేవలు
- డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ స్థాయికి చేరిన మధుసూదన్

పలమనేరు : పలమనేరులో ప్రాథమిక విద్యనభ్యసించిన కుర్రాడు గ్రూపు–1 పరీక్షలో సత్తా చాటి ఆర్‌డీఓగా ఎంపికవడమే విశేషమనుకుంటే.. ఇప్పుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఓఎస్‌డీగా నియమితులు కావడం మరింత గొప్పగానే భావించాలి. ఈ ఘనత సాధ/ంచిన గజ్జెల మధుసూదన్ పేరు అంతటా మార్మోగుతోంది. తంబళ్లపల్లె మండలం కోటకొండకు చెందిన రామచంద్ర కుమారుడే మధుసూదన్. పలమనేరు తహసీల్దార్ కార్యాలయంలో రామచంద్ర క్లర్క్‌గా పనిచేసే సమయంలో మధుసూదన్ 1 నుంచి 5వ తరగతి వరకు స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుకున్నారు. ఆపై తిరుపతిలో ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతరం 2018 గ్రూప్-1 పరీక్షలో స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించారు. తొలుత ధర్మవరం ఆర్‌డీఓగా నియమితులయ్యారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కడప ఆర్‌డీఓగా బదిలీ అయ్యారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి సజావుగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశారు. ఆయన పనితీరును గమనించిన ప్రభుత్వం ఇప్పుడు డిప్యూటీ సీఎం ఓఎస్‌డీగా నియమించింది. దీంతో మన ఊరిలో చదివిన పిల్లవాడు పవర్‌స్టార్‌కు ఓఎస్‌డీనా అంటూ పలమనేరు వాసులు సంబ్రమాశ్చర్యాలు వ్యక్తం చేస్తున్నారు.



భార్య, కుమారుడితో మధుసూదన్ (ఫైల్)

చదువుకున్న బడిలో..



పలమనేరు ఆదర్శస్కూల్‌లో మధుసూదన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

తాను చదువుకున్న పలమనేరు ఆదర్శస్కూల్‌లో 2018 ఏప్రిల్‌లో పిల్లలతో సమావేశం ఏర్పాటు చేశారు పక్కా ప్లానింగ్‌తో ప్రిపేరైతే గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం ఐఏఎస్ సాధించవచ్చని వివరించారు. . సిలబస్ మొత్తం కవర్ అయ్యే పుస్తకాలతోపాటు దినపత్రికలను చదవాలని సూచించారు. కరెంట్ అఫైర్స్‌పై పట్టుండాలని తెలిపారు. తన ఇంటర్వ్యూలో శేషాచలం అడవులు, ఎర్రచందనం స్మగ్లింగ్, ఎర్రచందనంతో తయారైయ్యే వస్తువులు, స్పెషల్ స్టేటస్, విభజనచట్టం, సమాజ సేవలపైనే ప్రశ్నలడిగారని పిల్లలకు వివరించారు. అప్పట్లో మధుసూధన్యుడు! అనే శీర్షికతో సాక్షిలో ప్రత్యేక కథనం సైతం ప్రచురితం కావడం గమనార్హం.




2018లో సాక్షిలో వెలువడిన కథనం

గురువు మాటే లక్ష్యం..

పలమనేరు ఆదర్శ పాఠశాలలో మధుసూదన్‌ను అప్పట్లో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు నాయుడు ప్రోత్సహించేవారు. ‘‘రేయ్ నువ్వు కలెక్టరువి కావాలిరా’’ అని తరచూ చెబుతుండేవారు. గురువు మాటనే మధుసూదన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. హైస్కూలు విద్యను వి.కోట, చౌడేపల్లెలో పూర్తిచేసి తిరుపతిలో ఇంటర్ ఎంపీసీ చదివి ఆపై వాకాడులో బీటెక్ పూర్తిచేసి హైదరాబాదు ఆర్‌సీరెడ్డి స్టడీ సర్కిల్‌లో గ్రూపు-1కు ప్రిపేరయ్యారు. పరీక్ష రాసి 750కి 457 మార్కులతో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించారు.

కరువు నేలపై ప్రత్యేక శ్రద్ధ

పలమనేరు ప్రాంతంలోని మెట్టపొలాల్లో సాగునీటి సమస్య ఎక్కువని ఇందుకోసం డ్రిప్ సిస్టం, నీటి నిల్వ గుంతలు లాంటి కార్యక్రమాలతో కరువును పారదోలాలనే ఆలోచన అప్పట్లోనే ఆయనలో ఉండేది. కలెక్టరు కావాలనే లక్ష్యాన్ని మదిలో నింపిన పలమనేరు పాఠశాలను ఎన్నటికీ మరువనని అప్పట్లోనే చెప్పారు. ధర్మవరం ఆర్‌డీఓగా కోవిడ్ సేవల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. ఇటీవల కడప ఆర్‌డీఓగా జిల్లాలో ఎన్నికలను సైతం సమర్థవంతంగా నిర్వహించారు.



ఓఎస్‌డీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్ (ఫైల్)

ఆనందంగా ఉంది



మా పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు మధుసూదన్ చదువుకున్నాడు. చిన్నప్పటినుంచే మంచి క్లవర్ స్టూడెంట్. ఆ బాలుడి టాలెంట్ చూసి రేయ్ నువ్వు తప్పకుండా కలెక్టర్ కావాలిరా అనేవాడిని. అదే లక్ష్యంలో మధు సైతం ఓ గోల్ పెట్టుకున్నాడు. సాటి పిల్లలు అప్పట్లోనే రేయ్ కలెక్టర్ అంటుంటే ఎస్ నేను కలెక్టరవుతానని వాదించేవాడు. మధు ఇంతటి ఉన్నస్థాయిలోకి వెళ్లడం చాలా ఆనందంగా ఉంది.

– శ్రీనివాసులు నాయుడు, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల, పలమనేరు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

బైరెడ్డిపల్లె : లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర స్పష్టం చేశారు. మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో మహతి ఫౌండేషన్ సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహా రాన్ని గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. వైద్యాధికారుల సలహాలను తప్పకుండా పాటించాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవడం మంచిదన్నారు. 108,102 సేవలు, తల్లి పాల విశిష్టత, కుటుంబ నియంత్రణ ప్రాధాన్యత, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శాలిని పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలని వినతి



అమరావతి కాలనీ

కుప్పంరూరల్ : పురపాలక పరిధిలోని అమరావతి కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందే మురుగు చేరుతోందని, దీంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు. అలాగే అవసరాలకు తగ్గట్టు విద్యుత్ స్తంభాలు కూడా లేవని, దీంతో తరచూ కరెంట్ సరఫరాకు అంతరాయ ఏర్పడుతోందని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: డెంగీ నివారణ మాసోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం ఉప్పరపల్లె గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి గిరీషా తెలిపారు. ఆయన మాట్లాడుతూ దోమకాటుతో సంక్రమించే వ్యాధులను వివరించామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించినట్లు వెల్లడించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ఆరోగ్య సిబ్బంది నీలకంఠ, శిఖామణి, జానకి, రషీద్, రుక్మిణి, ఎల్లమ్మ, సుధారాణి, వనజ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కస్తూర్బాలో బాలికలకు కరాటే శిక్షణ

రామకుప్పం: మండలంలోని విజలాపురంలో ఉన్న కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో మంగళవారం స్థానిక ధార్మిక్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాలంటే చదువుతోపాటు కరాటే నేర్చుకోవాలని సూచించారు. దీంతో ఆరోగ్యం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థులు ఎదుటివారిని నిలువరించే శక్తిసామర్థ్యాలను పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధార్మిక్ సేవా సమితి అధ్యక్షుడు విజలాపురం మహేష్, కరాటే మాస్టర్ ఏకాంబరం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మల్లేష్ యాదవ్

బాధ్యతగా ప్రజలకు సేవ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి: బాధ్యతగా ప్రజలకు సేవలందించేందుకు నాయకులందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని గోనుమాకులపల్లెలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రెడ్డివారి విజయభాస్కర్ రెడ్డి, ఆనంద, మురహరి రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు విదేశీయుల వితరణ



కనమనపల్లెలో విద్యార్థులతో విదేశీయులు

గుడుపల్లె: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన వాటిని విదేశీయుల సౌజన్యంతో ప్రవాసాంధ్రులు అందజేశారు. మండలంలో కనమనపల్లెకు చెందిన పలువురు బ్రిటన్‌లో స్థిరపడ్డారు. తమ ఉన్నతికి బాటలు వేసిన స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం ఇవ్వాలని బ్రిటన్‌లోని మోహన్, పార్థసారథి నిశ్చయించుకున్నారు. ఆ దేశస్తుల సహకారంతో 120మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులు అందజేశారు. ప్రతి ఏటా విదేశాలలో ఉన్న వారి సహకారంతో తామీ కార్యక్రమాలు చేస్తున్నామని, ఇక్కడే రెండు రోజులు ఉండి విద్యార్థులతో గడిపి అనంతరం విదేశాలకు వెళ్లనున్నట్టు చెప్పారు.

‘నేను బడికి పోతా’పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు తదితరులు

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బాబురెడ్డి మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బడికి నిలిచిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను వివరించారు. పిల్లలను పనులు పంపకుండా పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, గ్రామస్తులు కుమార్ రెడ్డి, భూపతి, శివ, రామచంద్ర పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ధ్వంసంపై ఫిర్యాదు

గంగవరం: వ్యవసాయ భూమి చుట్టూ ఏర్పాటు చేసుకున్న ఫెన్సింగ్‌ను రాత్రికి రాత్రే ధ్వంసం చేశారంటూ గణేష్ అనే రైతు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు..ఉల్లికుంటకు చెందిన మునెమ్మ పేరిట సర్వే నంబర్ 250/3 లో 1.80 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత తనకూ వాటా ఉందంటూ మునెమ్మ భర్త తమ్ముడు గంగులప్ప తరచూ గొడవకు దిగేవాడు. మునెమ్మతోపాటు కుమారుడు గణేష్‌పై కుటుంబసభ్యులతో కలిసి దౌర్జన్యం చేసేవాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం కోర్టు నుంచి గణేష్ ఇంజెక్షన్ ఆర్డర్ పొంది తమ భూమి చుట్టూ రాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. అయితే సోమవారం ఆ ఫెన్సింగ్‌ను గంగులప్ప తన అనుచరులతో కలిసి ధ్వంసం చేశాడు. ఇదిలా ఉండగా ఈ రెండు కుటుంబాల రాజకీయ తగాదాలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. బాధితుల్జీ వైఎస్సార్‌సీపీ అయితే, గంగులప్ప కుటుంబం టీడీపీకి చెందిన వాళ్లు. గణేష్ గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పని చేశాడు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫెన్సింగ్‌ను తన చిన్నాన్న ధ్వంసం చేశాడని, ఆయన బారి నుంచి తమను రక్షించాలని పోలీసులను గణేష్ కోరాడు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

వి.కోట : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. మంగళవారం మండలంలోని తోటకనుమలో ఆమె పర్యటించారు. పది రోజులుగా గ్రామంలో విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. బాధితులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలను తరచూ శుభ్రం చేయాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని చెప్పారు. ఓవర్ హెడ్ ట్యాంకులో నీటిని నింపిన ప్రతిసారీ క్లోరినేషన్ చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ రాత్రివేళల్లో ఫాగింగ్ చేయించాలని సూచించారు. ఫీవర్ సర్వే, లార్వల్ సర్వే రిపోర్ట్‌లను ఎప్పటికప్పుడు పంపించాలని కోరారు. జ్వరం లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రందించాలని గ్రామస్తులకు తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్సలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మాధవి పాల్గొన్నారు.

ఊరు చేరాలంటే ఏరు దాటాల్సిందే!

- మెయిన్ రోడ్డుకు దూరంగా ఏటిగడ్డిండ్లు
- వెళ్లాలంటే ఏడు కిలోమీటర్లు చుట్టాల్సిందే..
- కౌండిన్యపై వంతెన నిర్మిస్తేనే రహదారి

పలమనేరు : మండలంలోని కౌండిన్య అడవికి సమీపంలో విసిరిపారేసినట్టున్న గ్రామమే ఏటిగడ్డ. పెంగరగుంట పంచాయతీలో ఏటిగడ్డిండ్లు పేరుతో పిలిచే ఈ ఊరిలో నలభై యానాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరిలో కొందరు సేద్యం, మరికొందరు అడవిలో ఫలసాయం సేకరించుకుని కుటుంబాలను పోషించుకుంటుంటారు. పలమనేరు– గుడియాత్తం రహదారిలోని మొసలిమడుగు నుంచి కిలోమీటర్ దూరంలో ఈ గ్రామం ఉంది. కానీ మధ్యలో ఉన్న కౌండిన్య నది కారణంగా ఊర్లోకి వెళ్లేందుకు దారిలేకుండా పోయింది. దీంతో అభివృద్ధికి దూరంగా గ్రామం మిగిలిపోయింది. దశాబ్దాలుగా రహదారి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు విన్నవిస్తున్నా పట్టించుకునేవారే లేరు. యానాది సంఘం రాష్ట్ర నేతలు కూడా ఏళ్ల తరబడి ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నా ఫలితం శూన్యం.

సమస్య ఇదీ..

ఏటిగడ్డిండ్లు గ్రామానికి మొసలిమడుగు నుంచి వెళ్లాలి. కానీ మధ్యలోని కౌండిన్య నదిలో ఏడాదికి రెండు మూడు నెలలు మినహా మిగిలిన సమయాల్లో నీరుంటుంది. దీంతో ఈ గ్రామస్తులు పలమనేరుకు వెళ్లాలంటే కృష్ణాపురం, సముద్రపల్లె మీదుగా పెంగరగుంట క్రాస్‌కు వచ్చి అక్కడి నుంచి పలమనేరుకు ఏడు కిలోమీటర్లు చుట్టుకొని రావాల్సి ఉంటుంది. మరోవైపు గ్రామానికి చెందిన పదిమంది దాకా విద్యార్థులు పెంగరగుంట, పలమనేరులోని పాఠశాలలకు వెళ్లాలన్నా కష్టాలు తప్పడం లేదు. రవాణా మార్గం లేక ఇక్కడి రైతులు సైతం వాణిజ్య పంటలకు స్వస్తి పలికి ఆహార పంటలైన వరి, రాగి, పశు గ్రాసం సాగు చేసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఏడు కిలోమీటర్లు చుట్టుకొని బైక్‌పై వెళ్లాల్సిన దుస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణం చేపట్టలేదు కానీ, సముద్రపల్లె డెయిరీ నుంచి నాలుగు కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏది ఏమైనా కౌండిన్యపై వంతెన నిర్మిస్తేనే గ్రామస్తుల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది.

రైతులకూ తప్పని ఇక్కట్లు

కౌండిన్య నదికి పడమటి వైపు మొసలిమడుగు గ్రామానికి చెందిన పలువురు రైతులకు పొలాలున్నాయి. వీరు నదిలో నీరున్నప్పుడు ట్యూబ్‌ల సాయంతో లేదా చిన్నపాటి పడవల్లోనే నదిని దాటాల్సి వస్తోంది. ప్రస్తుతం ఏటిగడ్డిండ్లుకు వెళ్లేందుకు నదిలో కొంతమేర మట్టిని తోలి దానిపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే నది ప్రవహిస్తుంటే మాత్రం వీరి కష్టాలు వర్ణనాతీతం. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిని సారించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.



ఏటిగడ్డకు వెళ్లేందుకు కౌండిన్య నదిపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతమిదే

అసంపూర్తిగా ‘కానుక’

- పాఠశాలలకు అందని యూనిఫామ్
- విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు

బైరెడ్డిపల్లె : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్కారు బడుల్లోని విద్యార్థులకు అవస్థలు మొదలైనట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు పూర్తవుతున్నా ఇప్పటికీ యూనిఫామ్ అందించకపోవడంపై మండిపడుతున్నారు. పూర్తిస్థాయిలో పుస్తకాలు సైతం పంపిణీ చేయకపోవడ దారుణమని విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాల మొదలైన రోజే జగనన్న విద్యాకానుక పేరిట పూర్తి విద్యాసామగ్రితో కిట్ అందజేసే వారని గుర్తు చేసుకుంటున్నారు. అందులో పాఠ్య పుస్తకాలు, నోట్సులు, యూనిఫామ్, బూట్లు, సాక్సులు ఉండేవని వివరిస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం విద్యాకానుక పేరు మార్చడంలో చూపి శ్రద్ధ, పిల్లలకు విద్యాసామగ్రిని సకాలంలో అందించడంలో చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పష్టత కరువు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీలో ప్రభుత్వం జాప్యం చేస్తుంది. మండలంలో 84 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా 1 నుంచి 10వ తరగతి వరకు 7,013 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి రెండు జతల యూనిఫామ్‌కు సరిపడా క్లాత్ పంపిణీ చేసి కుట్టు కూలీ కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే మండలంలో ఇప్పటికీ ఒక విద్యార్థికి కూడా యూనిఫామ్ క్లాత్ పంపిణీ చేయలేదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఉపాధ్యాయుల నుంచి స్పష్టమైన సమాధానం కరువైంది. అసలు యూనిఫామ్ క్లాత్ ఇస్తారా..ఇవ్వరా అనే సందిగ్ధత నెలకొంది. కొంత మంది విద్యార్థులు గత ఏడాది ఇచ్చిన యూనిఫామ్‌నే వేసుకుని స్కూల్‌కు వస్తున్నారు. మరి కొంత మంది విద్యార్థుల యూనిఫామ్ చిరిగిపోవడంతో వారు ఇతర దుస్తులు వేసుకునే రావాల్సి వస్తోంది. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఏంటనే అనుమానాలను తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూనిఫామ్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కడపనత్తం ఉన్నత పాఠశాలలో గత ఏడాది ఇచ్చిన యూనిఫామ్‌తో హాజరైన విద్యార్థులు, అవి కూడా లేకపోవడంతో కలర్ డ్రస్‌తో వచ్చిన పిల్లలు

త్వరలోనే వచ్చే అవకాశముంది

విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశాం. అందులో యూనిఫామ్ క్లాత్ లేదు. అది ఎప్పుడు వస్తుందో ఇంకా తెలియడం లేదు. త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. క్లాత్ రాగానే అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తాం.

– సుబ్రమణ్యం, ఎంఈఓ, బైరెడ్డిపల్లె

ఇప్పటికే ఆలస్యమైంది

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్ క్లాత్ త్వరగా అందజేయాలి. ఇప్పటికే ఆలస్యమైంది. క్లాత్ ఇప్పుడు ఇచ్చినా టైలర్ దగ్గర మరో 15 రోజులు పడుతుంది. నాణ్యమైన క్లాత్ సరఫరా చేస్తే బాగుంటుంది. యూనిఫామ్ లేక పిల్లలు బడికి వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు.

– సుగుణ, విద్యార్థి తల్లి, లక్కనపల్లె